◆ కథ




అనగనగా ఒక బావగారు. అనగనగా ఒక మరదలుగారు. మరదలు డిగ్రీ పూర్తి చేసి, పుస్తకాలు - పత్రికల్లో తలమునకలవుతూ వుంది. మరదలు పెళ్ళి కోసం బావగారు, ఆబాలగోపాలంతో సహా ప్రయత్నాల్లో వున్న రోజులవి. పొరుగూరు వెళ్ళి అత్తారింటికి ఆలస్యంగా తిరిగొచ్చాడు బావ. అప్పటికి అత్త, మామ, భార్య గాఢ నిద్రలో వున్నారు. ఆలస్యంగా వచ్చిన బావకి అన్నం పెట్టి, ఆపై ఆకు వక్క ఇచ్చింది మరదలు. పెరట్లో ఆరుబయట తనకేసిన మంచం పక్కనే, మరో మంచం మీద కూర్చున్న మరదలుని చూస్తూ సాలోచనగా నవ్వాడు బావ.

"ఏమండోయ్ బావగారూ. ఎందుకలా నవ్వుతారూ?... నాకు థాట్ రీడింగ్ కూడా తెలుసనం డోయ్" అంది మరదలు.

తుళ్ళిపడ్డాడు బావ. థాట్ రీడింగే... ఓర్నాయనోయ్... ఇదెక్కడి గొడవ!... ఒకరి మనసులో వున్నది మరొకరు చదవ గలిగితే, పెర్సనల్ అంటూ ఏదీ మిగలకుండా పోతే... ఈ ఆలోచనతోనే బావకి గంగవెర్రులెత్తినట్ట యింది. కానీ, తొందరపడి తన మనోభావాలు బయటికి తెలీనివ్వ లేదు.

"మరదలా థాట్ రీడర్ గారూ... మనకి అవేమీ రావ నుకుంటే పప్పులో కాలేసినట్టే. నా మనసులోనిది చదవాలని ప్రయత్నించే వాళ్ళెవరికీ నేనంత సులభంగా లొంగను. దొరకను. ఎందుకంటే నేను చిన్నప్పటి నుంచీ స్ట్రాంగ్ థాట్ రీడ ర్ని..." అని నవ్వాడు బావ.

"ఎందుకలా నవ్వటం?" అంది మరదలు.

"నీ మనసు నేను స్పష్టంగా చదవగలుగుతున్నాను. అందుకని" అన్నాడు నవ్వుతూ బావ.

మరదలు పిల్ల వళ్ళు జలదరించింది. చిన్నగా కంపించింది.

"మీరనేది పట్టి హంబగ్. నిజమే మాత్రం లేదు. నన్ను డ్యూప్ చేస్తున్నారు" అంది మరదలు గాఢంగా బావ కళ్ళలోకి చూస్తూ.

"నో...నో" తొట్రుపడుతూ అన్నా, సర్దుకున్నాడా పాతికేళ్ళ బావగారు. పద్దెనిమిదేళ్ళ మరదలు తనకంటే తెలివైనది కావటం భరించలేక అతి జాగ్రత్త వహిస్తూ "థాట్ రీడింగ్‌లో నేనెన్నో బహుమతులు గెలుచుకున్నాను. ఒక పుస్తకం కూడా రాసాను. మీ అక్క నీకెప్పుడూ చెప్పలేదా?" అని గంభీరంగా అడిగాడు.

"లేదు బావా... నిజంగా నేనీ సంగతి ఇప్పుడే వింటున్నాను. నువ్వు థాట్ రీడర్‌వని నాకు తెలీదు. లేకపోతే" అర్థోక్తిలో ఆపింది మరదలు.

"లేకపోతే... ఓహ్... థాట్ రీడర్‌కి మాటల్తో చెప్పాల్సిన అవసరం ఏముంది?" అన్నాడు బావ.

మళ్ళీ మరదలు సన్నగా కంపించింది.

చాలాసేపు థాట్ రీడర్ బావగారికి నిద్ర పట్టలేదు. ఏదేదో వాగేసాను. నేను నిజంగా థాట్ రీడర్‌ని కానని నా మరదలుకి తెలిసిపోదు కదా?" అని ఆలోచించసాగాడు కళ్ళు మూసుకుని మంచం మీద పడుకున్న థాట్‌రీడర్ బావగార్.

బావి వెనుక, గడ్డివాము చెంత, సన్నజాజుల పందిరి దగ్గర వెన్నెల్లో నిద్రపట్టక విహరిస్తున్న మరదలికి మొదటిసారిగా అనుమానం వచ్చింది- 'అబద్ధాలాడారా ఈ థాట్ రీడర్ బావగార్'

అసహనంగా పెదాలు కొరుక్కుంటూ లేచి నిలబడి గడ్డి వాము దాటి పెరట్లో కొచ్చింది మరదలు. థాట్ రీడర్ బావగార్ చిన్నగా గురుకు పెడుతూ సన్నగా నిద్రలోకి జారుకుంటూ కనిపించాడు.

సుంకర భాస్కరరావు

---

ఉన్నట్టుండి తలుపు తోసుకుని లోపలికొచ్చాడు సెక్రటరి.
మండిపడింది మేడమ్.
"చూడు! లోపల నేనేపన్లోనైనా వుండచ్చు. అందుకని లోపలికొచ్చేప్పుడు ఇప్పట్నుంచి తలుపుతట్టి లోపలికి రావాలి" బుద్ధి చెప్పిందావిడ.
"తెలుసు మేడమ్. అందుకనే మీరేం చేస్తున్నారో ముందుగా ఆ తాళంచెవి కన్నం లోంచి చూసి ఆ తర్వాతే లోపలికొస్తానెప్పుడూ" చెప్పాడా సెక్రటరి హుషారుగా.



– గొల్లపూడి శైలజ